

జిల్లాలో 8 మినీ గోకులాలు ప్రారంభం

అనకాపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం పలు మండలాల్లో 8 మినీ గోకులాలను ప్రారంభించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 750 మినీ గోకులాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సంక్రాంతి సందర్భంగా పల్లె పండుగలో భాగంగా జిల్లాలో 335 మినీ గోకులాలను ఆరు నియోజకవర్గాల్లో పారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. మిగిలిన 400 మినీ గోకులాల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఆదివారం పలు మండలాల్లో మినీ గోకులాలు ప్రారంభానికి ఏర్పాట్లు చేసినట్టు జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు తెలిపారు.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం

వరహా నదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు

- రాజకీయ పలుకుబడితో దందా
- అనధికార వేలం పాట నిర్వహించి గుత్తాధిపత్యం
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికారులు

(అనకాపల్లి/కోటవురట్ల- ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం, జిల్లాకు చెందిన మంత్రి మాజీ పీఏ అనుచరుడి అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇసుక మాఫియా ఆగడాలు మూడు ట్రాక్టర్లు, ఆరు లారీలుగా వర్ధిల్లుతోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



గొట్టివాడ వద్ద వరహా నదిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న దృశ్యం (ఫైల్)



కోటవురట్ల మండలం గొట్టివాడ గ్రామంలోని వరహా నది నుంచి ట్రాక్టరులో ఇసుక తరలిస్తున్న దృశ్యం

పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల మండలం పాత గొట్టివాడ వరహా నదిలో గత ఐదు నెలలుగా అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండానే ఇసుకను తోడేస్తున్నారు. గొట్టివాడ, కైలాసపట్నం, పాతరేవు గ్రామాలకు ఆనుకొని ఉన్న వరహా నది పరీవాహక ప్రాంతాల్లో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. జిల్లాకు చెందిన మంత్రికి ప్రైవేటు పీఏగా ఇటీవల వరకు కొనసాగిన వ్యక్తి అనుచరుడి అండదండలతోనే గొట్టివాడకు చెందిన ఒక నేత ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం రాత్రి వేళ, తెల్లవారుజామున గొట్టివాడ గ్రామానికి సమీప వరహా నదిలో ఇసుక తవ్వకాలు జరిపి ఎలమంచిలి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం అమలు చేస్తున్నప్పటికీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని చెలరేగిపోతున్నారు. అధికారులు కూడా రాజకీయ ఒత్తిళ్లతో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రి ప్రైవేటు పీఏగా కొంత కాలం కొనసాగిన వ్యక్తి అనుచరుడి అండదండలతో స్థానిక నేత ఐదు నెలల కిందట ఇసుక అనధికార తవ్వకాలకు ఏడాదికి రూ.5 లక్షల వంతున వేలం పాట పాడి, రోజుకు రూ.2 లక్షల విలువైన ఇసుకను తరలించుకుపోతున్నాడని తెలిసింది. ప్రభుత్వ భవనాలు, సిమెంట్ రోడ్లు, ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలు, వ్యక్తిగత ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్నప్పటికీ అనధికార వేలం పాట నిర్వహించి ఇసుకపై గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కాగా వరహా నది నుంచి ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నా, పైస్థాయి నుంచి వస్తున్న ఒత్తిడితో వదిలేస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి ... మిగతా 8వ పేజీలో



చుక్కల్లో విమాన టికెట్ల ధరలు

- బెంగళూరు-విశాఖపట్నం రూ.15 వేలు
- హైదరాబాద్, చెన్నైల నుంచైతే రూ.17 వేలు
- విశాఖ రావాలంటే కనీసం రూ.10వేలు ఉండాల్సిందే
- విజయవాడ-విశాఖపట్నం రూ.7 వేలు

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):

విద్య, ఉద్యోగాల నిమిత్తం ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న ఉత్తరాంధ్ర వాసులు సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు రావాలంటే టికెట్లకు అధిక మొత్తాలు చెల్లించాల్సి వస్తోంది. రైళ్లలో బెర్తులు లభించడం లేదు. దాంతో ఎక్కువ మంది విమాన ప్రయాణం ఎంచుకుంటున్నారు. తక్కువ సమయంలో, రద్దీ లేకుండా చేరుకోవచ్చునని టికెట్ల కోసం యత్నిస్తున్నారు. అయితే వాటి ధరలు ఆకాశంలో ఉండడంతో అవాక్కవుతున్నారు. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలలో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్నవారు ఎక్కువమంది ఉన్నారు. బెంగళూరు నుంచి శనివారం విశాఖపట్నం వచ్చినవారు రూ.15 వేలు పెట్టి టికెట్లు కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో ఈ ధర రూ.4,500కు మించి ఉండదు. కానీ ఇప్పుడు డిమాండ్ అధికంగా ఉండడంతో రెండు రెట్లు ఎక్కువ పెట్టాల్సి వచ్చింది. ఆదివారం ధరలు చూసుకుంటే అత్యధికంగా రూ.17,298, అత్యల్పంగా రూ.15,945 చూపిస్తోంది. ప్రయాణ సమయం దగ్గర పడుతున్న కొద్దీ వీటి రేట్లు పెరిగిపోతున్నాయి.

ఇక హైదరాబాద్ నుంచి అయితే రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. దాంతో చాలామంది విమాన ప్రయాణం ఎంచుకుంటున్నారు. మామూలు రోజుల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు టికెట్ ధర రూ.4 వేలలోపే ... మిగతా 8వ పేజీలో

పందెం కోళ్లు.. రెడీ

గ్రామాల్లో కోడి పందాల నిర్వహణకు సన్నాహాలు

- మారుమూల తోటల్లో గుట్టుగా బరిల ఏర్పాటు
- ఈ ఏడాది ముందుగానే సిద్ధం చేసిన నిర్వాహకులు



సంక్రాంతి బరికి సిద్ధమవుతున్న కోడి పుంజు

పందెం పుంజులు సిద్ధం

గ్రామాల్లో పోటీలకు పందెం పుంజులు సిద్ధమయ్యాయి. ఇతర ప్రాంతాల నుంచి రూ.3 వేలు నుంచి రూ.15 వేలు వరకు వెచ్చించి వాటిని కొనుగోలు చేసి తీసుకొచ్చి మేపుతున్నారు. జీడీపప్పు, బాదంపప్పు వంటి పోషకాహారాన్ని పెట్టి పోటీలకు రోజూ శిక్షణ ఇస్తున్నారు. సంక్రాంతి పండుగకు ముందుగానే బరిలను సిద్ధం చేస్తుండడంతో ఈ సంవత్సరం భారీ ఎత్తున డబ్బులు చేతులు మారే అవకాశం వుంది.

అనకాపల్లి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):

సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామాల్లో ముందుగా అందరికీ గుర్తొచ్చేది కోడి పందాలు. జిల్లాలో పండుగకు ముందే సన్నాహక కోడి పందాలు ఊపందుకున్నాయి. పండుగకు గ్రామాల్లోని మారుమూల తోటల్లో కోడి పందాలు నిర్వహించేందుకు నిర్వాహకులు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

అనకాపల్లి మండలంలోని 32 పంచాయతీలతో పాటు జీవీఎంసీ విలీన గ్రామాల్లో కూడా కోడి పందాలను ఉభయ గోదావరి జిల్లాకు దీటుగా నిర్వహించడం ఎప్పటి నుంచో ఆనవాయితీ వస్తోంది. అయితే ఈ సంవత్సరం సంక్రాంతి పండు గకు ముందు నుంచే కోడి పందాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. పందాల నిర్వహణకు బరిలను కూడా సిద్ధం చేస్తున్నారు. గ్రామాలకు, జన సంచారానికి దూరంగా పోలీసులు దాడులు చేస్తే సులభంగా తప్పించేందుకు వీలుగా వీటిని తయారు చేస్తున్నారు. ప్రధానంగా యూకలిప్టస్, జీడీ తోటల్లో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.



కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

గ్రామాల్లో కోడి పందాలు, పేకాటలు, గుల్లాటలు ఆడితే కఠిన చర్యలు తప్పవు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పూర్వం కోళ్లకు కత్తులు కట్టేవారిని స్టేషన్‌లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చాం. గ్రామాల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తున్నాం. స్థావరాలను ముందుగా గుర్తించి ప్రత్యేక నిఘా పెడుతున్నాం. జిల్లాలో ఎక్కడైనా సంక్రాంతిని పురస్కరించుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్టయితే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

- తుహిన్ సిన్హా, ఎస్పీ, అనకాపల్లి జిల్లా

ముమ్మరంగా వరి నూర్పులు

- పనుల్లో రైతులు నిమగ్నం

కె.కోటపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో వరి నూర్పులు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఈ ఏడాది వరి దిగుబడి పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కె.కోటపాడు మండలంలో రైతులు ఒకరికొకరు సాయం చేసుకుంటూ వరి నూర్పులు పూర్తి చేస్తున్నారు. సంక్రాంతిలోగా వరి నూర్పు పనులు పూర్తి చేసుకోవాలన్న పట్టుదలతో రైతులు ఉన్నారు.



వరి నూర్పులు నిర్వహిస్తున్న దృశ్యం

అంతటా సంక్రాంతి శోభ

- వస్త్ర దుకాణాలు రద్దీ
- మార్కెట్లు కిటకిట

అనకాపల్లి టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి):

జిల్లా అంతటా సంక్రాంతి సందడి నెలకొంది. శనివారం అనకాపల్లి పట్టణంలోని వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మార్కెట్లు రద్దీగా కనిపించాయి. పలు షాపింగ్ మాల్స్ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించడంతో జనం ఎగబడ్డారు.



కిక్కిరిసిన అనకాపల్లి మెయిన్‌రోడ్డు



అనకాపల్లిలో కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న వస్త్ర దుకాణం

వివిధ ప్రాంతాల నుంచి కూడా అనకాపల్లికి అధిక సంఖ్యలో జనం రావడంతో రహదారులు కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా చిననాలుగురోడ్ల జంక్షన్ నుంచి ఎన్టీఆర్ జంక్షన్ వరకు రహదారి కిటకిటలాడింది. ట్రాఫిక్ సీఐ ఎంవీ నారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించారు.

అనకాపల్లి జిల్లాకు అనిల్ అంబానీ



భూములకు సంబంధించిన మ్యాప్‌లు పరిశీలిస్తున్న అనిల్ అంబానీ

రిలయన్స్ గ్రూపు సంస్థల అధినేత అనిల్ అంబానీ శనివారం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం లాలంకోడూరు పంచాయతీ పరిధిలోని సీతపాలెం, సెటమెట్ట గ్రామాల పరిసరాల్లో గల భూములను పరిశీలించారు. సోలార్ ప్యానళ్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు కోసం ఆయన ఈ ప్రాంతాన్ని సందర్శించినట్టు అధికారులు తెలిపారు. - వార్త మెయిన్‌లో..

ఏయూకు రీసెర్చ్ ప్రాజెక్ట్

నేషనల్ అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో భాగంగా మంజూరు

- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్ వంద లోపు ఉన్న వర్సిటీలకు మాత్రమే అవకాశం
- రూ.10 కోట్లు కేటాయింపు
- సముద్ర గర్భంలోని వస్తువులు, జీవరాశులు, పరికరాలపై పరిశోధన



విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):

దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలను పెంచడంపై కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐ ఆర్ఎఫ్) టాప్-100లో నిలిచిన విశ్వవిద్యాలయాలకు భారీగా నిధులు మంజూరుచేసింది. టాప్-20లో నిలిచిన విశ్వవిద్యాలయాలను ఒక్కో హబ్ కేంద్రంగా ఎంపిక చేసి, 21 నుంచి వంద వరకూ ర్యాంకు సాధించిన యూనివర్సిటీలను వాటి పరిధిలో చేర్చింది. ఒక్కో హబ్‌కు రూ.100 కోట్లు చొప్పున మంజూరు చేసింది. హబ్ పరిధిలోని యూనివర్సిటీలను ... మిగతా 8వ పేజీలో

కేజీబీవీ విద్యార్థినులకు మళ్లీ అస్వస్థత

- ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన వెంటనే అనారోగ్యం
- ఏరియా ఆస్పత్రిలో చేర్పించిన కుటుంబ సభ్యులు

నర్సీపట్నం, జనవరి 11(ఆంధ్రజ్యోతి):

అతిసార బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లిన ఆరుగురు కేజీబీవీ విద్యార్థినులు మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం డిశ్చార్జి అయిన విద్యార్థినులకు విరేచనాలు అవుతుండడంతో శనివారం ఉదయం కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తీసుకు వచ్చి ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. డీఈవో గిడ్డి అప్పారావునాయుడు చికిత్స పొందుతున్న విద్యార్థినుల కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి గురించి సిబ్బందితో మాట్లాడుతున్న డీఈవో

ప్రిన్సిపాల్‌తో సహా ముగ్గురికి షోకాజ్ నోటీసులు

కేజీబీవీ ప్రిన్సిపాల్ శాంతి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్ జయప్రకాశ్, డీసీడీవో పద్మకి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు డీఈవో అప్పారావునాయుడు తెలిపారు. మంగళవారం విద్యార్థినులు విరేచనాలు, వాంతులతో అస్వస్థతకు గురైన వెంటనే సకాలంలో సమాచారం ఇవ్వనందుకు సంజాయిషీ కోరుతూ ముగ్గురికి నోటీసులు అందజేశారు.

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

» ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ వెల్లడి » నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

ఎలమంచిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో గ్రామాలన్నీ అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని మేజర్ పంచాయితీ ఏటికొప్పాక, లైను కొత్తూరు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన రహదారులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలను పట్టించుకోకపోవడం వల్ల అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. ఇది గుర్తించే కూటమి ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, గోకులం షెడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేఎస్ కొండలరావు, జనసేన పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు అన్నం బాబ్జీ, బొద్దపు శ్రీను, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు, నాయకులు నాని తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఈ కార్యక్రమానికి ఎలమంచిలి మండలంలోని టీడీపీ శ్రేణులంతా దూరంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. సమాచారం లేని కారణంగానే తామంతా హాజరు కాలేదని ఏటికొప్పా గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తెలిపారు.

అచ్యుతాపురం:కొత్త పంచాయతీగా ఏర్పడిన రామన్నపాలేనికి త్వరలో పంచాయతీ భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే విజయ కుమార్ తెలిపారు. గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ హయాంలో గ్రామాల అభివృద్ధి పడకేసిందన్నారు. సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రామన్నపాలేన్ని చోడపల్లి పంచాయతీ నుంచి విడదీసి కొత్త పంచాయతీ ఏర్పాటు చేసిందన్నారు. కానీ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని వాపోయారు. పంచాయతీ భవనం మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి నర్శింగరావు, ధర్మిరెడ్డి బాబు, పుర్రే శ్రీనివాసరావు యాదవ్, ద్వారపురెడ్డి బాపు, పైల రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మామిడివాడ శివారు నారాయణపురంలో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలపై తీవ్ర నిర్లక్ష్యం చూపిందన్నారు. ఇది గుర్తించిన కూటి ప్రభుత్వం దేశ ప్రగతికి పల్లెలే పట్టు కొమ్మలని భావించి వాటి అభివృద్ధికి కంకణం కట్టుకుందన్నారు. ఇందులో భాగంగానే వివిధ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పి.నూకన్నదొర, పంచాయతీ సర్పంచ్ ఎం.అప్పలనర్స, గోకివాడ ఎంపీటీసీ సభ్యుడు అల్లవరపు నాగేశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ నానేపల్లి సన్యాసిరావు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అందుకూరి ప్రసాద్, జనసేన యువనేత బద్ది మహేష్, కొత్తూరు మాజీ సర్పంచ్ నానేపల్లి సాయివరప్రసాద్, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


ఏటికొప్పాకలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

మార్కెట్లలో సంక్రాంతి సందడి

» కోలాహలంగా మారిన ఎలమంచిలి పట్టణం
» వస్త్రాలు, నిత్యావసర సామగ్రి తదితరాల కొనుగోలుకు మునిసిపాలిటీ, పరిసర మండలాల నుంచి భారీగా రాక
» పలు చోట్ల ట్రాఫిక్ సమస్యతో వాహనదారులకు ఇబ్బందులు


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణ సముదాయాలు

ఎలమంచిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కెట్లు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పండుగకు అవసరమై సామగ్రి కొనుగోలుకు మునిసిపాలిటీ ప్రజలతో పాటు పరిసర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేస్తుండడంతో ఇక్కడ కోలాహల వాతావరణం నెలకొంది. రెండు రోజులుగా మార్కెట్లోని వస్త్ర దుకాణాలతో పాటు ఫ్యాన్సీ, బంగారం, కిరాణా తదితరాల కొనుగోలుకు రావడంతో ఆయా షాపులు కిటకిటలాడుతున్నాయి. చాలామంది కుటుంబ సమేతంగా వస్తుండడంతో రద్దీ మరింత పెరుగుతోంది. దిమిలి రోడ్డు జంక్షన్, సైతారుపేట జంక్షన్, ఎల్ఐసీ కార్యాలయం జంక్షన్‌ల వద్ద ఈ రద్దీ మరింత అధికంగా ఉంది. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

బీజేపీ రాంబిల్లి మండల అధ్యక్షుడిగా రాముడు

రాంబిల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాంబిల్లి మండల అధ్యక్షుడిగా వాడనర్సాపురానికి చెందిన కారే రాముడు ఎన్నికయ్యారు. అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయనను ఎన్నుకున్నారు. రాముడు ఈ పదవికి ఎంపిక కావడం ఇది మూడవసారి. ఈ సందర్భంగా ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ రాంబిల్లి మండలంలో పార్టీ పటిష్ఠతకు మరింత కృషి చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, పార్లమెంట్ కన్వీనర్ వర్మరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, తదితన నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


కారే రాముడు

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం : ప్రగడ


భజన బృందానికి దుస్తులు అందిస్తున్న ప్రగడ

అచ్యుతాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావనను అంతా అలవర్చుకుని తద్వారా ప్రశాంతంగా జీవనాన్ని సాగించాలని ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని దుప్పితూరు గ్రామంలో జరిగిన ధనుర్మాసోత్సావాలకు ఆయన హాజరయ్యారు. తొలుత స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా భజన బృందం సభ్యులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

14న జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు

మునగపాక, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాకలో ఈనెల 14న సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నారు. ఇం దుకు సంబంధించిన పోస్టర్‌ను జనసేన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల అధికార ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ శనివారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద పండుగ సందర్భంగా ఇటు వంటి పోటీలు నిర్వహిస్తుండడం వల్ల అందరిలో సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందన్నారు. అలాగే, స్నేహపూర్వక వాతావరణం కలుగుతుందని వివరించారు. పోటీలు ప్రశాంతంగా జరిగేలా అంతా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దాడి అప్పలనాయుడు, వేగి కృష్ణ, కాండ్రేగుల పరదేశిరావు, పెంటకోట శ్రీరామ్మూర్తి, ఆడారి గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ జట్లకు శిక్షణ

» నునపర్తిలో ప్రారంభం


ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ జట్లతో అసోసియేషన్ ప్రతినిధులు

అచ్యుతాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ బాల బాలికల అండర్-19 జట్లకు శనివారం మండలంలోని నునపర్తిలో శిక్షణ శిబిరం ప్రారంభమైంది. రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సంఘం విశాఖజిల్లా చైర్మన్ ఆర్.వెంకటరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 21 వరకు నాగ్‌పూర్‌లో 62వ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయన్నారు. ఈ జట్లకు ఈ నెల 16వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని వివరించారు. పోటీల్లో క్రీడాకారులు రాణించాల్సిందిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీవి నగేష్, గొంప నరసింహనాయుడు, పి.శంకరరావు, డీవీఎస్ రాజు, పి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన బాలుడు

» పోలీసులను ఆశ్రయించిన బాధితురాలి తల్లిదండ్రులు

ఎలమంచిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఐదేళ్ల బాలికపట్ల ఓ బాలుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఆ బాలిక తల్లిదండ్రులు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఎస్ఐలు ప్రాథమిక విచారణ జరిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు వైద్యుల నివేదిక ఆధారంగా తెలియాల్సి ఉందని రూరల్ ఎస్ఐ చెప్పారు.

పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

మునగపాక, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. తిమ్మరాజుపేట డావిన్సీ పాఠశాలలో జరిగిన ఈ వేడుకలకు ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ హాజరయ్యారు. పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎండీ కర్రి సుందరయ్య, డైరెక్టర్ రమణాజీతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం : మండల కేంద్రం అచ్యుతాపురంలోని భవానీ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి హాజరయ్యారు. భోగి మంట వేయడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణంలో రోడ్లపై ప్రమాదకర గుంతలు పూడ్చివేత

ఎలమంచిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను మునిసిపల్ అధికారులు ఎట్టకేలకు పూడ్చివేత చర్యలు చేపట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు రోడ్లపై గుంతలను సంక్రాంతి పండుగలోపు పూడ్చివేయాలని అధికారులను ఆదేశించిన నేపథ్యంలో అంతా యుద్ధప్రాతిపదికన పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కోర్టుపేట ప్రధాన రోడ్డుతో పాటు, గాంధీనగర్ ప్రధాన రోడ్డుపై పడిన గోతులను పూడ్చారు. ఇప్పటి వరకు ఈ రోడ్డు దారుణంగా ఉండేది. తరచూ ప్రమాదాలు జరిగేవి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని కూడా ప్రచురించింది. వీటన్నింటినీ గుర్తించిన అధికారులు ముందుగా ఎక్కడెక్కడ గోతులు ఉన్నాయో గుర్తించారు. నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభించారు. దీంతో వాహనచోదకులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. త్వరలో రహదారులను పూర్తిస్థాయిలో బాగుచేయాలని అంతా కోరుతున్నారు.


కోర్టుపేట రోడ్డుపై గోతులను పూడ్చుతున్న సిబ్బంది

ఉత్తమ పౌరులుగా విద్యార్థులు ఎదగాలి

» ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఓలేటి సత్యనారాయణ
» శ్రీ ప్రకాష్‌లో ముగిసిన 'కేరింతలు'


ఓలేటి సత్యనారాయణను సన్మానిస్తున్న విద్యా సంస్థల ప్రతినిధులు

పాయకరావుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, దేశానికి మంచి పేరు తెచ్చే పౌరులుగా విద్యార్థులు ఎదగాలని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకులు, శ్రీ వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం ప్రాజెక్ట్ కన్వీనర్ ఓలేటి సత్యనారాయణ ఆకాంక్షించారు. శనివారం పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో నిర్వహించిన కేరింతలు ముగింపు కార్యక్రమం ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఆశాదృక్పథం, ఉన్నత లక్ష్యంతో కలిగి ఉంటూ వాటిని సాధించేందుకు కృషిచేయాలన్నారు. స్వామి వివేకానంద ఆశించినట్టు విద్యార్థులు గుండె ధైర్యం, సాహసంతో ముందుకు సాగాలన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఆటపాటలతోకూడిన విద్యాబోధన విద్యార్థులకు ఉత్తేజాన్ని కలుగజేస్తాయన్నారు. అలాగే, విలువలు, విజ్ఞానం, విజయం ఈ మూడు అంశాలతో తమ విద్యాబోధన సాగుతుందని ఆయన తెలిపారు. అనంతరం విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శులు సీహెచ్.విజయ్‌ప్రకాష్, అజయ్‌ప్రకాష్ ఓలేటి సత్యనారాయణను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, కన్వీనర్ టి.సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆండాళ్ల అమ్మవారి నీరాటోత్సవాలు


అలంకరనలో ఆండాళ్ల అమ్మవారు

పాయకరావుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగస్వామి ఆలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని ఆండాళ్లఅమ్మవారి నీరాటోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సంక్రాంతి వరకు జరి గే ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రధానార్చకుడు ఇ. కృష్ణస్వామి పాండురంగస్వామివారిని పెండ్లికుమారుడిగా నూతన వస్త్రాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అలాగే, అండాళ్లమ్మవారిని ముస్తాబుచేసి నీరాట్టోత్సవం, తిరుమంజరం అభిషేకాలు, ప్రత్యే క పూజలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కె.దివ్యతేజ మాట్లాడుతూ సోమవారం భోగిరోజు సాయంత్రం గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు.

నేడు న్యాయంపూడిలో హోం మంత్రి పర్యటన

నక్కపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం మండలంలోని న్యాయంపూడి గ్రామంలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎస్సీ కాలనీ సమీపాన ఎన్ఆర్‌జీఎస్ పథకంలో రహదారి నిర్మాణాన్ని ప్రారంభిస్తారు. ఈ గ్రామంలో రూ.కోటి నిధులతో జరగనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఇటీవల జాతీయ ఉత్తమ పంచాయతీ పురస్కారం న్యాయంపూడికి దక్కింది. ఈ గ్రామ సర్పంచ్ రెడ్డి వరహాలు హోం మంత్రి అనిత సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరనుంతు. ఇందుకు సంబంధించి గ్రామంలో సభను ఏర్పాటు చేస్తున్నారు.


గౌతమ్ సెంటర్‌లో అయిన ట్రాఫిక్ జామ్


రాత్రి 7 గంటల సమయంలో నిలిచిన వాహనాలు

'పేట'లో ట్రాఫిక్ జామ్... జనాలకు తిప్పలు

» సంక్రాంతి నేపథ్యంలో మార్కెట్ రద్దీ
» గ్రామాల నుంచి వచ్చిన వారితో రహదారులు కిటకిట

పాయకరావుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పురస్కరించుకుని దుస్తులు, నిత్యావసర సరుకులు కొనుగోలుకు గ్రామీణప్రాంతాల నుంచి వేలాదిగా తరలిరావడంతో శనివారం పాయకరావుపేటలో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ నెలకొంది. పట్టణంలో తాండవ వంతెన నుంచి మంగవరం రోడ్డు వరకు మెయిన్‌రోడ్డు ఇరువైపులా వ్యాపారుల ఆక్రమణలతోపాటు గ్రామాల నుంచి పాయకరావుపేట, తుని పట్టణాలనుంచి ప్రజలను తీసుకువస్తున్న ఆటోలు మెయిన్ రోడ్డులోని ఎక్కడపడితే అక్కడే నిలిపేస్తున్నారు. దీంతో ట్రిఫిక్ సమస్య తలెత్తి ప్రజలు నరకాన్ని చవిచూశారు. దీనికితోడు మెయిన్‌రోడ్డు ఇరువైపులా ఉన్న పలుషాపింగ్ మాల్స్, వ్యాపార కేంద్రాలకు పార్కింగ్ స్థలాలులేక వాహనదారులు రోడ్డుపైనే వాహనాలను నిలుపడంతో సమస్య తీవ్ర తరమవుతోంది.

పెదగుమ్ములూరులో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

ఎస్. రాయవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పురస్కరించుకుని మండలంలోని పెదగుమ్ములూరు గ్రామంలో పీఆర్‌టీయూ సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లాసాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. చీడికాడ, రావికమతం, గొలుగొండ, అనకాపల్లి, మునగపాక, కశింకోట, ఎస్. రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి, బుచ్చియ్యపేట తదితర 13 మండలాల నుంచి 21 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీలు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కొనసాగాయి. ఇందులో విజేతలు ఎవరనేది తెలియాల్సి ఉంది. ఈ పోటీలను ఓ ప్రవేట్ విద్యాసంస్థల అధినేత సీతారామరాజు, డాక్టర్ అనిల్ వర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, సమన్వయకర్త సత్యనారాయణ, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడా జట్లు

అల్లూరి విగ్రహం ధ్వంసం చేసిన నిందితుల అరెస్టులో విఫలం

» సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అప్పలరాజు ధ్వజం

ఎస్. రాయవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగరాజుపాలెంలో స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో దుండగులను అరెస్టు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు మండిపడ్డారు. అల్లూరి విగ్రహం ధ్వంసం చేసి 12 రోజులవుతున్నా నిందితులను అరెస్టు చేయకపోవడంతో శనివారం సాయంత్రం ఆ గ్రామంలో ధ్వంసమైన అల్లూరి విగ్రహం వద్ద స్థానిక క్షత్రియ సేవా సమితి సభ్యులతో కలిసి సీపీఎం నేతలు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ గత డిసెంబరు 31తేదీ అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు గ్రామంలో ఉన్న అల్లూరి విగ్రహం చేయి, విల్లు తదితర భాగాలను ధ్వంసం చేశారన్నారు. ఈ నిందితులను ఇప్పటి వరకు గుర్తించకపోవడం చాలా బాధాకరమన్నారు. సాక్షాత్తు రాష్ట్ర హోం మంత్రి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అల్లూరి విగ్రహం ధ్వంసం సంఘటన జరగడం శోచనీమన్నారు. ఇకనైనా హోం మంత్రి స్పందించి వెంటనే దుండగులను అరెస్టుకు ఆదేశాలు జారీ చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని అప్పలరాజు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలను తీ వ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ, ఎం రాజేష్, గణపతిరాజు, ఏ సీతారామరాజు, సాంబమూర్తి రాజు, సన్యాసిరాజు, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.


లింగరాజుపాలెంలో అల్లూరి విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారిగా రఘు


బాధ్యతలు చేపట్టిన రఘు

నక్కపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదిన్నరగా ఇన్‌ఛార్జిలతో నడుస్తున్న మండల పరిధి వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రికి ఇప్పుడు పూర్తి స్థాయిలో రెగ్యులర్ వైద్యాధికారిని నియమించారు. ఈ మేరకు శనివారం డాక్టర్ రఘు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ ఆస్పత్రికి మెడికల్ ఆఫీసర్‌గా యలమంచిలి డాక్టర్ అభినయ్‌కుమార్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టారు. శనివారం బాధ్యతలు చేపట్టిన రఘు మాట్లాడుతూ సాధారణ,సీజనల్ వ్యాధులతోపాటు, దీర్ఘకాలిక రోగాలను కూడా నయం చేసే శక్తి ఆయుర్వేదానికి ఉందన్నారు. ఈ వైద్యసేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇన్‌ఛార్జి మెడికల్ ఆఫీసర్లతో నడుస్తున్న కన్నూరుపాలెం ఆయుష్ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ కె.నాగ అనూష, దేవరాపల్లికి గ్రీష్మ, నర్సీపట్నం బి. దేవి, డుంబ్రిగుడకు ఇందిరా ఝాన్సీరాణి, అరకులో షేక్ షబానా ప్రవీణ్, గంపరాయికి ఎం.మౌనిక శ్రీని నియమించారు.

'పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందంజ'


బాధితునికి సీఎం రిలీఫ్ చెక్‌ను అందజేస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలను ఆదుకోవడంలో ముందుంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని మంగవరం గ్రామానికి చెందిన త్రిపారాల అజయ్‌కి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.10 లక్షలు శనివారం పెదిరెడ్డి చిట్టిబాబు, పార్టీ పట్టణఅధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను బాధితుడు అందజేశారు. ఈ సందర్భంగా పాయకరావుపేటలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి మెరుగైన వైద్య సాయం కోసం హోం మంత్రి వంగలపూడి అనిత సిఫార్సులతో సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసినట్టు చెప్పారు. అలాగే, ప్రభుత్వం ప్రజలకు అనేక సం క్షేమ పథకాలను చేరువచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోనే కొండబాబు, వేములపూడి అప్పారావు, బుద్దాల శ్రీను, అనిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు : ఎమ్మెల్యే పంచకర్ల



వాడచీపురుపల్లి శివారు ఎన్టీఆర్ కాలనీలో కాలువ ప్రారంభోత్సవంలో పంచకర్ల

పరవాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా వాడ చీపురుపల్లి, నాయుడుపాలెం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామానికి సక్రమమైన రహదారుల నిర్మాణంతో పాటు తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఎన్టీపీసీ భూ నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్‌లు శివలంక లక్ష్మి, కూండ్రపు వరలక్ష్మి, కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్, చింతకాయల ముత్యాలు, వియ్యపు చిన్న, బొద్దపు శ్రీనివాసకాసులు, బుగిడి రామగోవిందరావు, శిరపురపు అప్పలనాయుడు, కూండ్రపు శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, లాలం ఈశ్వరరావులతో పాటు అన్ని శాఖల అధికారులు ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సింహాచలం కొండకు భక్తులు పాదయాత్ర



సింహాచలానికి ఇరుముడులు కట్టుకుని పాదయాత్రగా బయల్దేరిన భక్తులు

సబ్బవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన అరవై మంది అప్పన్నస్వామి దీక్ష చేపట్టి భక్తులు శనివారం మొక్కు చెల్లించుకునేందుకు బయల్దేరారు. ఇందులో భాగంగా సింహాచలం కొండపైకి పాదయాత్రగా తరలి వెళ్లారు. తొలుత సింహాద్రి అప్పన్నకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడులు కట్టుకుని స్వామి నామాన్ని జపిస్తూ గొల్లలపాలెం నుంచి నంగినారపాడు, వెదుళ్లనరవ మీదుగా ముందుకు సాగారు. గ్రామానికి చెందిన కొసిరెడ్డి అప్పలరాజు, లక్ష్మీ దంపతులు భిక్షను ఏర్పాటు చేశారు.

బొజ్జన్నకొండపై విదేశీ పర్యాటకుల సందడి



బొజ్జన్నకొండ వద్ద విదేశీ పర్యాటకులు

తుమ్మపాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద శనివారం విదేశీ పర్యాటకులు సందడి చేశారు. బెలియం నుంచి ఇండియా వచ్చిన వీరంతా పలు పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా బొజ్జన్నకొండను కూడా ఆసక్తిగా తిలకించారు. కొండపై గల బౌద్ధ స్థూపాలు, గుహలయాలు, శిలాసంపదను తిలకించి వాటిని ఫొటోలు తీసుకున్నారు. అలాగే ప్రధాన గుహలో గల బుద్ధుని విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బొజ్జన్నకొండ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. పురాతన శిలా సంపదను క్షుణ్ణంగా పరిశీలించారు. బొజ్జన్నకొండ సందర్శన తమకు గొప్ప అనుభూతిని కలిగించినట్టు వారు తెలిపారు.

'యువత ఓబన్నను స్ఫూర్తిగా తీసుకోవాలి'



ఒడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డే ఓబన్న జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉత్తరాంధ్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేఎల్‌జే మోహనరావు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఓబన్నను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కె.వెంకట సూర్యనారాయణ, గోవింద, జామి రాము, దిమిలి సన్యాసిరావు, బీసీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ అధికారి నాగేశ్వరరావు, వార్డెన్ పీలా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వాడ చీపురుపల్లిలో భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



మేలుకొలుపు నిర్వహిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

పరవాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాడ చీపురుపల్లిలో శనివారం మేలుకొలుపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఉంచి భక్తిపాటలు పాడుతూ ఊరేగింపు జరిపారు. ఫౌండేషన్ సభ్యులు కూండ్రపు అప్పలనాయుడు, ముత్యాలనాయుడు, శ్రీరామ్మూర్తి, కడిమిశెట్టి కృష్ణవేణి, శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండండి'



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

పరవాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. 120 మైక్రాన్ లోపు ఉన్న పాలిథిన్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు నిషేధమన్నారు. ప్రజలంతా ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్‌ను వినియోగించడం వల్ల అనారోగ్య సమస్యలు, కాలుష్యం పెరిగిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, నాయకులు జాజుల చిన్నారావు, కరణం అప్పారావు, సంజీవమ్మ, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



అనకాపల్లిలోని కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో జన కోలాహలం



తుమ్మపాల మెయిన్ రోడ్డుపై స్తంభించిన ట్రాఫిక్

మార్కెట్లకు సంక్రాంతి

» ఎటు చూసినా జనసందోహం » వస్త్రాలు, నిత్యావసరాలు, కోళ్లు తదితరాల కొనుగోలుకు భారీగా రాక » కోలాహలంగా తుమ్మపాల సంత



సంతలో విక్రయానికి ద్విచక్ర వాహనంపై తీసుకు వచ్చిన నాటుకోళ్లు



తుమ్మపాల వారపు సంతలో దుకాణాల వద్ద జనసందడి

తుమ్మపాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సమీపించిన నేపథ్యంలో అనకాపల్లి, తుమ్మపాల, కొత్తూరు తదితర ప్రాంతాల్లో మార్కెట్లు సందడిగా మారాయి. ఎక్కడ చూసినా జన సందడే కనిపిస్తోంది. తుమ్మపాలలో శనివారం జరిగిన వారపు సంత కిటకిటలాడింది. అనకాపల్లి పట్టణంతో పాటు తుమ్మపాల, మార్టూరు, మాకవరం, మామిడిపాలెం, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, మెట్టపాలెం, బవులవాడ తదితర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో అవసరమైన సామగ్రి కొనుగోలుకు విచ్చేశారు. దీంతో ఎటుచూసినా కోలాహలంగా కనిపించింది. నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయలు, గృహోపకరణాలు, వస్త్రాలు, వ్యవసాయ పనిముట్లు తదితరాల అమ్మకాలు భారీగానే జరిగాయి. కనుమ పండుగను పురస్కరించుకుని నాటుకోళ్లను ఎక్కువగా కొనుగోలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే సంతల్లో కెల్లా తుమ్మపాల సంత ప్రధానమైనది. తాజా కూరగాయలు సంతకు రావడంతో పోటీపడి మరీ కొనుగోలు చేశారు. అలాగే వస్త్ర వ్యాపారులు సైతం అధికంగానే ఉన్నాయి. పశువుల సంత కూడా జోరుగానే సాగింది. ఇదిలావుంటే, వరుస పండుగల నేపథ్యంలో ఇక్కడి సంతకు భారీగా జనం తరలి రావడంతో మెయిన్‌రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు చాలా సేపు నిలిచిపోవడంతో ఇటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసుల జాడ లేకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక యువకుల చొరవ చూపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రేషన్ వాహనాన్ని తనిఖీ చేసిన కొణతాల



సరకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనకాపల్లి టౌన్, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): ఇక్కడి నూకాంబిక నగర్‌లో శనివారం రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. వినియోగదారులకు ఇస్తున్న సరకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్డుదారులందరికీ రేషన్ అందేలా చూడాలని వాహన సిబ్బందికి సూచించారు.

45 మంది యువకులు రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

అనకాపల్లి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బైపాస్ రోడ్డులోని ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం అభినవ భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమం నిర్వాహకులు భవానీ శంకర్, వీపీ రాజులతో పాటు అమ్మ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కిరణ్, డాక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్టు

కొత్తూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం రాజుపాలెం శివారులో శనివారం పేకాట ఆడుతున్న ఐదుగుర్ని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ జి.రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. ఐదుగుర్ని పట్టుకుని వారివద్ద నుంచి రూ.3,750 నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

వేల్పుల వీధి గౌరమ్మకు సారె సమర్పణ



గౌరీపరమేశ్వరుల ఆలయం వద్దకు సారెను ఊరేగింపుగా తీసుకు వచ్చిన భక్తులు

అనకాపల్లి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేల్పుల వీధిలో కొలువుదీరిన గౌరమ్మకు శనివారం సాయంత్రం భక్తులు సారెను సమర్పించారు. తొలుత ఇళ్ల వద్ద తయారు చేసిన అరిసెలు, సున్నుండలు, లడ్డూలు, చలిమిడి, కాజాలు, తదితర వివిధ రకాల పిండి వంటలను మహిళలు పళ్లాల్లో పేర్చి ఊరేగింపుగా మెయిన్ రోడ్డులోని గౌరీ పరమేశ్వరుల ఆలయానికి తీసుకువచ్చారు. అక్కడ అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం నైవేద్యంగా సమర్పించారు. ఇళ్లకు తీసుకు వెళ్లి వాటిని ప్రసాదంగా పంచారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకుడు రాంకీ

అనకాపల్లి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఈ నెల 18న జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ వేడుక పోస్టర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేశ్, కమిటీ సభ్యులు, వేల్పులవీధి పెద్దలు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగులకు తప్పిన ప్రమాదం

» వంజంగి నుంచి కారులో నలుగురు విశాఖ వస్తుండగా బోల్తా

» స్వల్ప గాయాలు » ఆస్పత్రికి తరలించిన స్థానికులు



బోల్తా పడిన ఆర్మీ ఉద్యోగులు ప్రయాణిస్తున్న కారు

కొత్తూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కుంచంగి వద్ద నేవల్ క్వార్టర్స్ దాటిన తరువాత ఆర్మీ ఉద్యోగులు ప్రయాణిస్తున్న కారు బోల్తాపడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. అల్లూరి సీతారామరాజు జిల్లా వంజంగి నుంచి విశాఖ వెళ్తున్న నలుగురు ఆర్మీ ఉద్యోగులు ప్రయాణిస్తున్న కారు కుంచంగి సమీపం వద్దకు వచ్చే సరికి సాయంత్రం ఒక్కసారిగా అదుపు తప్పింది. దీంతో పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఇది చూసిన స్థానికులు హుటాహుటిన అక్కడకు వెళ్లి కారులో ఉన్న నలుగుర్నీ బయటకు తీశారు. వారంతా స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా ఈ ప్రమాదంలో కారు నుజ్జయ్యింది. క్షతగాత్రులను వేరే వాహనంలో అనకాపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరంతా విశాఖకు చెందిన వారుగా స్థానికులు తెలిపారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

సబ్బవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాలను పలు పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరంలోని గుల్లేపల్లిలో గల అక్షర పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఈ వేడుకలను ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, ఎంపీపీ బోకం సూర్యకుమారి ముఖ్య అతిథులుగా హాజరైన భోగిమంటను వెలిగించారు. ప్రిన్సిపాల్ బి.అప్పారావు, సర్పంచ్ బండారు మంగ, గండి రవికుమార్, బోకం రామునాయుడు, బండారు శ్రీను, ఎడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : ఇక్కడి దైట్ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. భోగిమంటను కళాశాల చైర్మన్ రత్నాకర్ వెలిగించారు. కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో యువకుడి అరెస్టు



నిందితుడ్ని చూపుతున్న ఎస్ఐ

అనకాపల్లి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో మరో యువకుడ్ని శనివారం అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఈ నెల ఆరో తేదీన ఏఎంఏఎల్ కళాశాల సమీపంలోని ఏలేరు కాలువ వద్ద ముగ్గురు యువకులను అరెస్టు చేసి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న అనకాపల్లి మండలం కూండ్రం గ్రామానికి చెందిన మొల్లి ఫాల్గునను శనివారం మెయిన్‌రోడ్డులోని పాత కోర్టు భవనం వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

శ్రీవారికి గరుడ వాహన సేవ



గరుడ వాహనం పై శ్రీవారిని ఊరేగింపు

అనకాపల్లి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గాంధీనగరం అంజయ్య కాలనీలో గల వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై శ్రీవారిని ఊరేగించారు. అర్చక ఎగ్జామినర్ రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు చక్రవర్తి, మారుతిలు రాత్రి పదకొండు గంటలు దాటే వరకు ఊరేగింపు సాగింది. ఇందులో కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దారి పొడవున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సబ్బవరం వాసవీ సంఘం అధ్యక్షుడిగా సంతోష్ గుప్తా



కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సభ్యులు

సబ్బవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) వాసవీ సంఘం మండల అధ్యక్షుడిగా తవ్వవానిపాలేనికి చెందిన దంగేటి సంతోష్ గుప్తా ఎన్నికయ్యారు. ఇరువాడలో శనివారం ఏర్పాటైన సమావేశంలో ఈ మేరకు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా దంగేటి సన్యాసిరావు, కోశాధికారిగా నున్న సతీష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో సంఘం పెద్దలు పి.వరహాలు, కె.పూర్ణిమ ప్రమాణం చేయించారు. అనంతరం ఐదు పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంఘం రీజనల్ చైర్‌పర్సన్ జంగాల ఫణి, జోన్ చైర్‌పర్సన్ బండారు వెంకట రామారావు, పెన్నం వెంకటేశ్, పెన్నం రామకృష్ణ, రూరల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

35 మద్యం బాటిళ్లతో ఇద్దరిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్/కశింకోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రాంతాల్లో 35 మద్యం బాటిళ్లతో ఇద్దరు పట్టుబడ్డారు. అనకాపల్లిలోని గవరపాలెం పార్కు జంక్షన్ వద్ద ఓ వ్యక్తి నుంచి పది మద్యం బాటిళ్లను శనివారం స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. గవరపాలేనికి చెందిన పరమేశ్వరరావు ఓ షాపులో మద్యాన్ని కొనుగోలు చేసి తీసుకు వెళుతుండగా అనుమానం వచ్చి తనిఖీ చేశామన్నారు. పది మద్యం క్వార్టర్ బాటిళ్లు ఆయన వద్ద లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అలాగే, కశింకోట మండలం పేరంటాలపాలేనికి చెందిన పువ్వల ప్రసాదరావును బయ్యవరం ఆర్చి వద్ద 25 మద్యం సీసాలతో పట్టుకున్నట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు.

సంక్రాంతి కళ

- పల్లెల్లో పండగ సందడి
- ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు రద్దీ
- కిటకిటలాడిన వస్త్ర, కిరాణా దుకాణాలు


రద్దీగా ఉన్న పాడేరు ప్రధాన రహదారి


ముంచంగిపుట్టు సంతలో వస్త్ర దుకాణాల వద్ద గిరిజనులు

పాడేరురూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభం కావడంతో స్వగ్రామాలకు తరలివెళ్లే ప్రయాణికులతో శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రైవేటు జీపుల, ఆటోల స్టాండ్‌లు రద్దీగా మారాయి. మైదాన ప్రాంతంలోని వివిధ జిల్లాలో విద్యను అభ్యసించే విద్యార్థులు స్వగ్రామాలకు వెళ్లేందుకు, అదే విధంగా పండగ బట్టలకు పాడేరు వస్త్ర దుకాణాలకు వచ్చిన వారితో ఆర్టీసీ కాంప్లెక్స్ కళకళలాడింది. మన్యంలో కొన్ని గ్రామాల్లో ఇప్పటికే సంక్రాంతి పండగ ప్రారంభం కావడంతో వస్త్ర, కిరాణా సామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితో పట్టణంలోని ప్రధాన రహదారులు వాహనాలతో కిటకిటలాడాయి. వస్త్ర, కిరాణా షాపుల వద్ద కొనుగోలుదారుల తాకిడి నెలకొంది.


పాడేరు బస్టాండ్‌లో స్వ గ్రామాలకువెళ్తున్న విద్యార్థులు

హుకుంపేటలో సంతలో కొనుగోలుదారుల తాకిడి

హుకుంపేట: మండల కేంద్రమైన హుకుంపేటలో శనివారం జరిగిన సంత సంక్రాంతి కొనుగోలుదారులతో సందడిగా కనిపించింది. పరిసర గ్రామాల గిరిజనులు వచ్చి నిత్యావసరాలు, పండగ సామగ్రి కొనుగోలు చేశారు. ముక్కనుమకు అవసరమైన కోళ్లు, మేకలకు గిరాకీ నెలకొంది. మేక రూ.10 వేలకు పైగా ధర పలికింది. నాటు కోళ్ల అమ్మకాలు విరివిగా సాగాయి. కిరాణా, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి.


మాట్లాడుతున్న ఆదివాసీ నేతలు

ముంచంగిపుట్టులో కిటకిట..

ముంచంగిపుట్టు : మండల కేంద్రంలో శనివారం జరిగిన పం డగ సంత వినియోగదారులతో కళకళలాడింది. ఇసుక వేస్తే రాలని అంతగా జనాలు వచ్చారు. సంక్రాంతికి కొత్త బట్టలు కొనుగోలు చేయడానికి మండల పరిధిలో గల 23 పంచాయతీలలో పలు గ్రామాల గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వస్త్ర దుకాణాలు, ఫ్యాన్సీ కిరాణా, స్టీల్ సామాన్లు తదితర దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. వ్యాపారం బాగా సాగడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు.

గిరిజన విద్యార్థికి ఏయూ డాక్టరేట్


ఏయూ ప్రొఫెసర్ ధనుంజయరావు నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు అందికుంటున్న సురేశ్ కుమార్

పాడేరురూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏయూలోని పొలిటిక్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పరిశోధక విద్యార్థి టి.సురేశ్ కుమార్‌కు వర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. అల్లూరి జిల్లా హుకుంపేట మండలం తడిగిరి గ్రామానికి చెందిన సురేశ్ కుమార్ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన గిరిజన యువకుడు. ఆయన విద్యాభ్యాసం ఒకటి నుంచి 5వ తరగతి వరకు తరిగిడిలో, 6 నుంచి 10 వరకు హుకుంపేట ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ పాడేరు డిగ్రీకళాశాల్లో పూర్తి చేశారు. పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ పరిశోధన వర్సిటీలో పూర్తి చేశారు. డాక్టరేట్ రావడంపై సురేశ్ కుమార్‌ను ఏయూ పరిశోధన పర్యవేక్షకులు ప్రొఫెసర్ వీర్రాజు, పేమానందవ, డాక్టర్.హరీశ్ అభినందించారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

హుకుంపేట జనవరి 11 ఆంధ్రజ్యోతి; ఏజెన్సీనుంచి గంజాయి తరలిస్తున్నా ఇద్దరు వ్యక్తులకు అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ ఎల్.సురేశ్ శనివారం తెలిపారు. హుకుంపేట గ్రామ సమీపంలో కొంతెలి జంక్షన్ వద్ద వాహన తనీఖీలు నిర్వహిస్తుండగా పెద్దబయలు మండలం వంచూర్బ గ్రామం నుంచి ఎస్.కోట వైపు వెళ్తున్నకారును సోదా చేశామన్నారు. అందులో సుమారు 160 కిలోల గంజాయితోఇద్దరు పట్టుబడ్డారన్నారు. వారిని విచారించగా పెద్దబయలు మండలం గోమంగి గ్రామానికి చెందిన గోమంగి మలేశ్వరావు, కారు డ్రైవర్ విజయనగరం జిల్లా ఎస్. కోటకు చెందిన కె. పవన్ కుమార్‌గా గుర్తించామన్నారు. కారు స్వాధీనం చేసి నిందులను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్టు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పది కిలో మీటర్లు వెళ్తేనే...రేషన్ సరకులు

- జంపర్లోవ లబ్ధిదారుల అవస్థలు.. గ్రామానికి రాని వాహనం


సప్పర్ల జీసీసీ డిపో వద్ద రేషన్ బియ్యంను తీసుకుంటున్న జంపర్లలోవ గిరిజనులు

సీలేరు, జనవరి 11 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధి జంపర్లోవ జీసీసీ డిపో పరిధిలోని లబ్ధిదారులకు ఇంటింటికీ ఎండీఎం ఆపరేటర్ రేషన్ సరకులు తీసుకురాకపోవడంతో పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సప్పర్లకు వెళ్లాల్సి వస్తోంది. గత ప్రభుత్వం ఉన్నత ఆశయంతో ప్రజల చెంతకే ఉచిత బియ్యం, సరకుల సరఫరాకు వాహనాలను ఏర్పాటుచేసింది. ఈ వాహనదారుడికి రూ. 20 వేల వేతనం, ఒక ఎండీఎం ఆపరేటర్‌ను నియమించారు. జంపర్లోవ జీసీసీ పరిధిలోని ఎండీఎం ఆపరేటర్ గత ఏడాది పైగా తమ చెంతకు ఉచిత రేషన్ బియ్యం తీసుకువచ్చి పంపిణీ చేయడంలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జంపర్లోవ జీసీసీ పరిధిలో 300 మంది లబ్ధిదారులున్నారు. ఈ డిపో పరిధిలో గాలికొండ, పాత్రుని గుంట, నేతమర్రి, మైనకోట, గుర్రాలగొంది, గొడుగురాయి తదితర గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు ఎండీఎం ఆపరేటర్ రేషన్ బియ్యం సరఫరా చేయకపోవడంతో గత 13 నెలలుగా పది కిలో మీటర్ల దూరంలో ఉన్న సప్పర్ల జీసీసీ డిపోనకు లబ్ధిదారులు వెళ్లాల్సి వస్తోంది. దీనిపై జీకేవీధి తహసీల్దార్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లితా తమ గ్రామాలకు రేషన్ బియ్యం తీసుకు వచ్చి సరఫరా చెయ్యడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అలాంటి అప్పుడు అతనికి రూ. 20 వేలు చెల్లించడం ఎందుకుని ప్రశ్నిస్తున్నారు. లేదా జంపర్లోవ జీసీసీ పరిధిలో అన్ని గ్రామాలకు రేషన్ సరకులు అం దించేలా చర్యలు తీసుకోవాలని గాలికొండకు చెందిన పలాస ఇర్మి, కాకూరి కృష్ణ తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

'నాటు వైద్యానికి దూరంగా ఉండాలి'

సీలేరు, జనవరి 11, (ఆంధ్రజ్యోతి): గిరిజనులు నాటు వైద్యం, పసర మందులకు దూరంగా ఉండాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు సూచించారు. శనివారం జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలో కొండజర్త గ్రామంలో వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరంను నిర్వహించారు. వైద్యాధికారి డీకె హిమబిందు చెరుకుమళ్ళ గ్రామం నుంచి 8 కిలోమీటర్లు కాలినడకన చేరుకుని గ్రామంలో 69 మంది గిరిజనులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ముగ్గురు జ్వరబాధితులకు రక్త పూతలను సేకరించి పరీక్షలను నిర్వహించారు.అనంతరం గిరిజనులతో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో కలిగిని మార్పుల తో అప్రమత్తంగా ఉం డాలని, ఎవరైనా జ్వరాల బారిన పడితే వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలను చేయించుకోవాలని సూచించారు. నాటు వైద్యానికి దూరంగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ పోతురాజు, ఏఎన్ఎంలు సీత, మత్యకొండ పాల్గొన్నారు.


చిన్నారికి వైద్య పరీక్ష నిర్వహిస్తున్న వైద్యాధికారి హిమబిందు

ఇంటర్వ్యూ..

గిరిజన రోగులు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలు ఉపయోగించుకోవాలి

- జి. ప్రభావతి, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, చింతపల్లి.

చింతపల్లి ఏరియా ఆస్ప త్రిలో గతంలో కంటే ఓపీ భారీగా పెరిగినట్టు సూపరింటెండెంట్ ప్రభావతి తెలిపారు. ఆమె ఆస్ప త్రిలో అందిస్తున్న వైద్య సేవలపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఇవీ..


ప్రభావతి

ప్ర. ఏరియా ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలు గిరిజన రోగులు ఏమేర కుఉపయోగించుకుంటున్నారా?

జ. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలు అందుబాటులోఉన్నాయి. కొత్తగా వివాహం చేసుకున్న మహిళలు, పిల్లలను ఆరోగ్య శ్రీ కార్డు లోనమోదు చేసుకోవడం లేదు. దీంతో అర్హత ఉన్నా ఈ పథకం వర్తించడంలేదు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య శ్రీ కార్డు కలిగి ఉండాలి. ఆయుష్మాన్ భారత్ సేవలు పొందేందుకు రోగి తమ వెంట ఫోన్ తీసుకురావాలి. ఫోన్ నంబర్‌లేక ఆయు ష్మాన్ భారత్ నమోదు ఇబ్బందిగా ఉంది.

ప్ర. ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయా?

జ. ఆస్పత్రిలో శస్త్రచికిత్సలకు అనువుగా ఆపరేషన్ థియేటర్ ఆధునిక పద్ధతిలో నిర్మించాం. ఆస్పత్రిలో ఎనస్థీషియా పోస్టు ఖాళీగా ఉండడంతో శస్త్రచికిత్సలు జరగడంలేదు. నెలాఖరు నాటికి ఎనస్థీషియా పోస్టు భర్తీకి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్ర.ఆస్పత్రిలో ఓపీ ఎలా ఉంది? గర్భిణులు, చిన్నపిల్లలకు ఎటువంటి వైద్య సేవలందుతున్నాయి?

జ. గతంతో పోల్చుకుంటే ఓపీ భారీగా పెరిగింది.రోజు 350-400 మందిరోగులు వస్తున్నారు. మైదాన ప్రాంతాల నుంచి స్త్రీవైద్యనిపుణులు ప్రతి రోజు వస్తున్నారు. గర్భిణులకు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేస్తున్నాం. సాధారణ ప్రసవాలు చేస్తున్నాం. ఆస్పత్రికి అనుబంధంగా ఎస్ఎన్‌సీయూ ఉన్నది. దీంతో చిన్నపిల్లలకు ఆధునిక వైద్యసేవలందిస్తున్నాం.

ప్ర. సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు?

జ. సికిల్ సెల్ ఎనీమియా ప్రాథమిక పరీక్షలు ఆస్పత్రిలో చేస్తున్నాం. నిర్ధారణ పరీక్షకు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్నాం. ధ్రువీకరణ పత్రంఅక్కడి వైద్యులు అందజేస్తున్నారు. రోగులకుఏరియా ఆస్పత్రిలో మందులు, చికిత్స అందిస్తున్నాం.

- చింతపల్లి, ఆంధ్రజ్యోతి

రూ. 35 లక్షలతో తాజంగి జలాశయం కాలువల మరమ్మతులు

- సాగునీటి సంఘం చైర్మన్ బోనంగి బాలయ్యపడాల్

చింతపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి జలాశయం కుడి, ఎడమ కాలువల మరమ్మతులు ప్రభుత్వం రూ.35లక్షల నిధులను విడుదల చేసినట్టు సాగునీటి సంఘం చైర్మన్ బోనంగి బాలయ్యపడాల్ తెలిపారు. శనివారం స్థానిక సర్పంచ్ మహేశ్వరితో కలిసి ఆయన జలాశయం కాలువల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా బాలయ్యపడాల్ మాట్లాడుతూ సుమారు 65ఏళ్ల క్రితం 1500 ఎకరాల భూములకు సాగు నీరు అం దించాలనే లక్ష్యంతో జలాశయాన్ని నిర్మించారన్నారు. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువలు మరమ్మతుకు గురికావడంతో పూర్తి స్థాయిలో పంట పొలాలకు సాగునీరు అం దడంలేదన్నారు. ఏటా రైతులు శ్రమదానంతో కాలువల మరమ్మతులు చేపట్టడంతో 400ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.ఈ నేపథ్యంలో మరమ్మతులు చేయాలని గత వైసీపీ ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినప్పటికి పట్టించుకోలేదన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉపాధి పథకం ద్వారా నిధులను విడుదల చేసిందన్నారు. ఈనిధులతో పనులు ప్రారంభించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెనుమల కాంతమ్మ, నీటి సంఘం వైస్ చైర్మన్ తమర్బ విశ్వనాథం, స్కూల్ కమిటీ చైర్మన్ శెట్టి మోహన్‌రావు, జనసేన సీనియర్ నాయకుడు ఉగ్రంగి లక్ష్మణరావు, కూటమి నాయకులు బోనంగి బెన్నలింగేశ్వరరావు, మినుముల సుందరరావు, కిముడు శ్యాంసుందర్, రీమల బాబూరావు పాల్గొన్నారు.


కాలువల మరమ్మతులకు భూమిపూజ చేస్తున్న బాలయ్యపడాల్

108 వాహనంలో గిరి మహిళ ప్రసవం

డుంబ్రిగుడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంద్రుపంచాయతీ పతలంగి గ్రామానికి చెందిన వంతల ప్రమీల అంబులెన్స్‌లో ప్రసవమైయింది. శుక్రవారం అర్ధరాత్రి ప్రమీలకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అం దించారు. వాహనంలో ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు బయలుదేరారు. మార్గ మధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ సుజాత సుఖ ప్రసవాన్ని చేశారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండడంతో డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.


అంబులెన్స్‌లో తల్లీబిడ్డ

ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు


బిరిమిశాలలో ప్రకృతి సాగు పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

పాడేరురూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఆరోగ్య వంతమైనదని మాస్టర్ ట్రైనర్ కోటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ బిరిమిశాల గ్రామాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి సందర్శించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో ఎ-గ్రేడ్ మోడల్‌గా నిలిచిన బిరిమిశాల గ్రామ మహిళా రైతు మాసాడ సూర్యకుమారి (ఏటీఎం మోడల్)ను మండల రైతులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే లాభాలు, వస్తున్న దిగుబడులను వివరించారు. పూర్వం పెద్దలు చేసిన వ్యవసాయం తిరిగి కొనసాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సర్వేశ్వరరావు, సన్నిబాబు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్నకు ఘన నివాళి

పాడేరు, జనవరి 11(ఆంధ్ర జ్యోతి):స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్నకు కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఓబన్న చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, ఇతర అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. నంద్యాల జిల్లాలోని సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన ఓబన్న స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు కోల్పోయారని డీఆర్‌వో కొనియాడారు. ఆయన త్యాగం వందేళ్లకు పైగా అవుతున్నా నేటికీ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా ఉందని అన్నారు. కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.


ఓబన్న చిత్రపటానికి నివాళులరిస్తున్న డీఆర్‌వో, సిబ్బంది

రోగులకు భోజనంలో నిర్లక్ష్యం వహిస్తే సహించం

- డీసీహెచ్ఎస్ కృష్ణారావు

ముంచంగిపుట్టు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీలో రోగులకు ఉచిత భోజనం అందించడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని డీసీహెచ్ఎస్ కృష్ణారావు హెచ్చరించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న భోజనం కనీసం నాణ్యత పాటించడం లేదని పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆయన స్పందించారు. శనివారం స్థానిక సీహెచ్‌సీని సందర్శించి రోగులకు సరఫరా చేస్తున్న భోజనాలపై ఆరా తీశారు. భోజనం సరఫరా చేస్తున్న వారితో మాట్లాడారు. రోగులతో మాట్లాడి వారికి భోజనం ఎలా అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. మెనూప్రకారం భోజనం అందించాలని, రోగులకు సరిపడినంత అన్నం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఆ విషయంపై రోగుల నుంచి ఇకపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని కృష్ణారావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సంతోష్ పాల్గొన్నారు.


సీహెచ్‌సీలో భోజన సరఫరా దారులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ కృష్ణారావు

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీ చేపడుతున్న పాకలపాటి గురుదేవుల ఆశ్రమం భక్తులు

చింతపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం కోసం శాకాహారం తీసుకోవాలని భీమసింగి పాకలపాటి గురుదేవుల ఆశ్రమ భక్తులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఆశ్రమం భక్తులు మహాకరుణ-అహింసాయుత శాఖాహార ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా మానవులు ఆత్మ ఉన్నతి, ఆరోగ్యకర జీవనం కోసం శాఖాహారం తీసుకోవాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. మాంసాహారం జోలికి వెళ్లరాదని సూచించారు.కార్యక్రమంలో భక్తులు రజిత, దేవి, నూకరాజు, సింహాద్రి పాల్గొన్నారు.

డూడూ బసవన్నల సందడి


పాడేరు మోదమాంబ కాలనీలో ఇళ్ల ఎదుట గంగిరెద్దులు

పాడేరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంకాంత్రి పురస్కరించుకుని గంగిరెద్దులు ఏజెన్సీ గ్రామాల్లో సందడి చేస్తున్నాయి. గంగిరెద్దులు మైదాన ప్రాంతంలో మాత్రమే ఉంటాయి. ప్రతి ఏడాది సంక్రాంతికి ముందు వారం ఏజెన్సీలో గంగిరెద్దుల వాళ్లు తిరుగుతారు. సంక్రాంతి సమయానికి తిరిగి మైదాన ప్రాంతానికి వెళ్లిపోతారు. అయితే మన్యంలో గంగిరెద్దులను అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. కొందరు భక్తులు వాటికి పూజలు చేస్తూ, వాటి యజమానులకు దుస్తులు, నగదు కానుకలు సమర్పిస్తున్నారు.

నేడు నవోదయ మోడల్ ఎంట్రన్స్ పరీక్ష

పాడేరురూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ (గవర్నమెంట్ టీచర్స్) ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ఆదివారం పాడేరులో నిర్వహించనున్న నవోదయ మోడల్ ఎంట్రన్స్ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ మండలాధ్యక్షురాలు వంజంగి హేమలత, కార్యదర్శి రేగం సత్యారావు, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బి.సన్యాసమ్మ కోరారు. ఆరోజు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాడేరు లోచలిపుట్టులో ఉన్న శ్రీఅక్షర హైస్కూల్లో ఈ పరీక్ష నిర్వహించ నున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థుల పేర్లు నమోదుకు, ఇతర వివరాలకు కె. దేముడు నాయుడు ఫోన్: 9441594403, బి.వేణుగోపాలరాజు ఫోన్: 7569505939లను సంప్రదించాలని వారు కోరారు.

పద్మాపురం గార్డెన్‌కు రహదారి విస్తరణ

అరకులోయ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అరకులోయలోని పద్మాపురం గార్డెన్‌ను ఆధునికీకరించనున్న నేపథ్యంలో ఇందులో భాగంగా స్థానిక ప్రధాన రహదారినుంచి పద్మాపురం గార్డెన్ వరకు రెండుకిలోమీటర్ల మేర రహదారి విస్తరణ పనులు గత మూడురోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు రాజధాని జంక్షన్ నుంచి గార్డెన్ ముఖద్వారం వరకు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే రెండుకిలోమీటర్ల మేర పూర్తి చేశారు. మిగిలిన సగం మరో రెండురోజుల్లోగా పూర్తికి పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.ఐటీడీఏ పీవో చొరవతో గార్డెన్ పనులతోపాటు ఈ రహదారి విస్తరించడంపై సర్వ త్రా హర్షం వ్యక్తమవుతోంది.


రహదారి పనులు

దివ్యాంగ జీవనం..సాయం అంతంతమాత్రం

- పన్నెండేళ్లుగా మంచానికి పరిమితమైన చిన్నారి భవ్య
- శతశాతం సదరం ధ్రువీకరణ పత్రం జారీ
- రూ.15 వేల పింఛన్ అర్హురాలైనా రూ.6వేలతో సరి
- న్యాయం చేయాలని తల్లిదండ్రులు వేడుకోలు

అనంతగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆడుతూ పాడుతూ గడపాల్సిన ఆ చిన్నారి మంచానికి పరిమితమైంది. ఆమె పేరులో ఉన్న 'భవ్య' జీవితంలో లేదు. వయసుకు తగిన ఎదుగుదల లేక, ఆరోగ్యం సహకరించని స్థితిలోని ఆ చిన్నారిచూసి ఆతల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతం. ఇంతటి దయనీయస్థితిలో ఉన్న చిన్నారికి ప్రభుత్వ పరంగా పింఛన్ పూర్తిస్థాయిలో అందడంలేదు. దీంతో ఆకుటుంబం ఆ చిన్నారి పెంపకానికి అవస్థలు పడుతోంది. వివరాలివి.. అనంతగిరి పంచాయతీ పెద్దూరు గ్రామానికి చెందిన కె.ప్రసాద్, కుమారి దంపతులకు తొలి సంతానంగా 2013లోని కుమార్తె భవ్య జన్మించింది.. తర్వాత మరో ఇద్దరు పుట్టారు. ప్రసాద్ ప్రైవేట్‌గా చిరు ఉద్యోగి. అయితే, ఆ దివ్య పుట్టుకతోనే మానసిక, శరీరకంగా పూర్తిస్థాయిలో అంగవైకల్యంతో ఉండడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదనకు అంతులేకుండాపోయింది. ఎదుగుతున్నా పరిస్థితిలో మార్పుకానపోవడంతో కుమార్తెకు ప్రభుత్వ పింఛన్ కోసం ప్రయత్నాలు సాగించారు.

నిర్ధారణ కోసం తిప్పలు

2018లో అరకు ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన సదరం క్యాంప్‌నకుభవ్యను తల్లిదండ్రులు ప్రసాద్, కుమారి తీసుకువెళ్లారు. అక్కడ పరీక్షించిన విశాఖకేజీహెచ్‌కు చెందిన వైద్యులు పూర్తిస్థాయిలో అంగవైకల్యం ఉన్నట్టు గుర్తించి, 90 శాతం మేర సదరం ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు.. అయితే, ధ్రువ పత్రంలో చిరునామా తప్పుడు పడడంతో పలుమార్లు దరఖాస్తు చేసినా పింఛన్ మంజూరు కాలేదు. దీంతో తిరిగి 2020లో విశాఖలో నిర్వహించిన సదరం క్యాంపునకు భవ్య పేరుపై స్లాట్ బుకింగ్ చేశారు. అనంతరం విశాఖపట్నం మానసిక వైద్య శాల వైద్యులు పరీక్షించి దివ్యకు బుద్ధి మాంద్యం వందశాతం ఉన్నట్టు ధ్రువ పత్రం మంజూరు చేశారు. ఈ పత్రంపైనే ప్రస్తుతం రూ.6వేల పింఛన్ అందుతోంది.

కనీస అవసరాలకూ అవస్థలే..

రెండేళ్ల క్రితం రూ.3వేల పింఛన్ భవ్యకు పింఛన్ మంజూరైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక, అదే పింఛన్ పెంచి రూ. 6 వేలు చేశారు.రూ.6వేలు చిన్నారి అవసరాలకు చాలడంలేదని ఆ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ కుమార్తె రూ.15 వేల పింఛన్‌కు అర్హురాలైనా ఈ మేరకు సాయం అందడంలేదని చెబుతున్నారు.


మంచానికి పరిమితమైన భవ్య

నా కుమార్తెకు న్యాయం చేయండి...

నా కుమార్తె పుట్టకతోనే పూర్తి అంగవైకల్యంతో మంచానికే పరిమితమైంది..కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత.. పూర్తిస్థాయిలోమంచానికి పరి మితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నారు. అధికారులు ఇకనైనా క్షేత్రస్థాయిలో నా కుమార్తె పరిస్థితిని చూసి, న్యాయం చేయాలి.

- కె.ప్రసాద్, భవ్య తండ్రి



కిక్కిరిసిపోయిన మెయిన్ రోడ్డు... ఫుట్‌పాత్ దుకాణాల వద్ద వస్త్రాలు కొనుగోలు చేస్తున్న గ్రామీణ ప్రజలు

మార్కెట్‌కు సంక్రాంతి శోభ

జనాలతో కిక్కిరిసిపోయిన మెయిన్ రోడ్డు.. దుకాణాలు కిటకిట

నర్సీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు సంక్రాంతి పండగ శోభ రెండు రోజుల ముందుగానే వచ్చేసింది. జనాలతో మెయిన్ రోడ్డు కిక్కిరిసిపోతోంది. ఫ్యాన్సీ, కిరాణా, వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. అబీద్ సెంటర్ నుంచి ఎన్‌కేపీటీ సెంటర్ వరకు, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పెద బొడ్డేపల్లి మదుం వరకు రద్దీ రెండు రోజులుగా రద్దీ పెరిగింది. పండగ సామగ్రి కొనుగోలుకు నర్సీపట్నం చుట్టు పక్కల ప్రజలు అధికంగా వస్తారు. తహసీల్దార్ కార్యాలయం దగ్గర నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఫుట్‌పాత్ వ్యాపారులు నేల దుకాణాలు వేసుకొని వస్త్రాలు విక్రయిస్తున్నారు. షోరూమ్‌లకు వెళ్లి ఖరీదైన వస్త్రాలు కొనుగోలు చేయలేని వారు ఫుట్‌పాత్ వస్త్రాలను కొంటున్నారు. అదే విధంగా ఫ్యాన్సీ, కిరాణా సామగ్రి కొనుగోలు దారులతో దుకాణాలు రద్దీగా కనిపిస్తున్నాయి. శనివారం నూకాలమ్మ గుడి వద్ద నాటుకోళ్ల సంత కిక్కిరిసిపోయింది. మెయిన్ రోడ్డులోని హోటళ్లలో కూడా రద్దీ కనిపించింది.

కూటమితోనే పల్లెల్లో అభివృద్ధి సాధ్యం

- ఐదేళ్లలో అభివృద్ధి పథంలో పంచాయతీలు: ఎమ్మెల్యే రాజు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పంచాయతీల న్నీ మోడల్‌గా తీర్చిదిద్దుతామని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రకటించారు. మండలంలోని కన్నంపాలెం, చాకిపల్లి, పంచాయతీల్లో శనివారం పల్లె పండగ పేరిట చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పల్లెల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయడం విశేషమన్నారు. గ్రామాల్లో రూ.4.21 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. రానున్న నాలుగున్నరేళ్లలో అన్ని గ్రామాల్లో తాగునీరు, మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, కూటమి నాయకులు పెద బాబు, మత్స్యరాజు, సిరిపురపు రమేశ్, బి.నానికుమార్, డి.వెంకట అప్పారావు, ఈవోపీఆర్డీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో బిల్లులు ఆదా



సమావేశంలో మాట్లాడుతున్న ఈపీడీసీఎల్ ఏఈఈ మనోజ్‌కుమార్

నర్సీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ వల్ల పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా ప్రతీ నెలా కరెంటు బిల్లు ఆదా అవుతుందని ఈపీడీసీఎల్ ఏఈఈ మనోజ్‌కుమార్ అన్నారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం సూర్యా పవర్ ట్రీ ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రీ కేవీ సోలార్ యూనిట్ పెట్టుకుంటే ప్రభుత్వం రూ.78 వేలు రాయితీ ఇస్తుందన్నారు. యూనిట్ ధరలో 90 శాతం బ్యాంకు రుణం, ఏడు శాతం వడ్డీకే ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.గజ్జాలమ్మ, రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కనకరాజు, రిటైర్డ్ ఎంఈవో జేఎస్ఎస్ నాగేశ్వరరావు, వాకర్స్ క్లబ్ ట్రెజరర్ అల్లు అప్పారావు, సభ్యులు వెలగా నారాయణరావు, దేవాడ త్రినాథరావు, చుక్కల జగన్నాథరావు పాల్గొన్నారు.

నాయుడుబాబు కుటుంబానికి అండగా ఉంటాం



నాయుడుబాబు కుటుంబీకులను పరామర్శించిన విజయ్, టీడీపీ నేతలు

నర్సీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన బొడ్డేటి నాయుడుబాబు కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ భరోసా ఇచ్చారు. పెదబొడ్డేపల్లిలో నాయుడుబాబు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి దుర్ఘటనలో ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. నాయుడుబాబు లేని లోటు కుటుంబానికి తీరనిదని, పార్టీ తరపున పూర్తి అండగా ఉంటామని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున రూ.25 లక్షలు, పార్టీ తరపున రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందుతుందని ఆయన తెలిపారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని టీటీడీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజునాయుడు, మధుబాబు, రెడ్డప్పల నాయుడు పాల్గొన్నారు.

మహిళ హత్యపై కొనసాగుతున్న దర్యాప్తు

- నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలతో ఏర్పాటు

చోడవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): లక్కవరంలో సంచలనం రేపిన మహిళా రైతు హత్యోదంతంపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ ఎం.శ్రావణి సీఐ బి.అప్పలరాజు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మహిళా రైతు హత్యకు పాల్పడిన వారిని గుర్తించేందుకు పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు సమాచారం. ఈ నెల 9న హత్య జరిగిన స్థలం వద్ద గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం కూడా డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు పరిశీలించారు. డీఎస్పీ శ్రావణి ఈ కేసు దర్యాప్తును రోజంతా పర్యవేక్షించారు. హంతకులను పట్టుకునేందుకు అనుమానితుల ఆరా తీస్తున్నట్టు తెలిసింది. కాగా మృతురాలు నరసమ్మ పీక కోసి, నట్టు తొలుత గుర్తించినా, పోస్టుమార్టంలో ఆమె వెన్ను భాగం, మెడపైనా, పక్కటెముకల వద్ద పదికి పైగా కత్తిపోట్లు ఉన్నట్టు గుర్తించారు. హత్యకు పదునైన కత్తిని ఉపయోగించినట్టు సమాచారం. కాగా ఈ హత్యకు పాల్పడిన వాడు స్థానికుడా? బయట ప్రాంతం నుంచి వచ్చారా? అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మొత్తం మీద సంచలనం రేపిన మహిళా రైతు కేసులో హంతకులను పట్టుకునే దిశగా పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తుండడంతో ఈ కేసు త్వరగానే ఒక కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు.

పారిశుధ్య లోపం.. రోగాల భయం!

- కోనాం ఎస్సీ కాలనీలో సమస్యల రాజ్యం
- డ్రైనేజీల్లో పేరుకుపోతున్న మురుగు
- పగిలిన తాగునీటి పైపులైన్.. బురదమయంగా రోడ్లు
- కొళాయిలకు హెడ్‌లు లేక తాగునీరు వృథా
- కలుషిత నీరే కాలనీ వాసులకు దిక్కు

కోనాం పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీలోని మురుగునీరు నిల్వ ఉండిపోతోంది. కాలనీలో మూడు కొళాయిలకు హెడ్‌లు లేక తాగునీరు వృథాగా పోతోంది. అయినప్పటికీ పట్టించుకునే నాథులే లేకపోవడంతో స్థానికులకు కలుషిత నీరే ఆధారమవుతోంది.



కోనాంలోని బురదమయంగా మారిన ఎస్సీ కాలనీ సీసీ రోడ్డు

చీడికాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కోనాలోని ఎస్సీ కాలనీలో ఎనిమిది నెలల క్రితం ఇంటింటికీ కొళాయిల ఏర్పాటుకు





కొళాయిలకు హెడ్‌లు లేక వృథాగా పోతున్న తాగునీరు... పగిలిన పైపులైన్ చూపుతున్న గ్రామస్థుడు

ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టారు. దీంతో పైప్‌లైన్ పగిలిపోవడంతో కొళాయిల్లో తాగునీరు కలుషితమవుతున్నది.

అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో ఆ నీటినే తాగుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కాలనీలోని పాటి అర్జునమ్మ, కంచిపాటి పార్వతి, కుంచెల పార్వతీ ఇళ్ల వద్ద కొళాయిలకు హెడ్‌లు లేక తాగునీరు వృథాగా పోతుందన్నారు. దీనికితోడు పైప్‌లైన్ పగిలిపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అలాగే తడి, పొడి చెత్త సేకరణకు కార్మికులు సైతం తమ కాలనీవైపు రాకపోవడంతో చెత్తను జలాశయంలోకి వేయాల్సి వస్తోందని కాలనీకి చెందిన వసంతసాంబ, వసంత దేముళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య సమస్య వల్ల ఎప్పుడు ఏ రోగం ప్రబలుతుందోనని వారు భయాందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

చలిసింగం రహదారి నిర్మాణానికి కదలిక

- అటవీ అనుమతులపై గ్రామాన్ని సందర్శించిన డీఎఫ్‌వో

రావికమతం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కొండ శిఖరం గిరిజన గ్రామం చలిసింగం రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఈ మేరకు డీఎఫ్‌వో ఎం.శామ్యూల్, చోడవరం రేంజ్ అధికారి బి.వి.రవివర్మ తదితరులు శనివారం కాలినడకన కొండలు ఎక్కి చలిసింగం గిరిజన గ్రామాన్ని సందర్శించారు. నిత్యావసర సరకుల కోసం గ్రామం నుంచి కొంత మంది గుర్రాలపై, మరి కొంత మంది కాలినడకన నెత్తిన బరువులతో కొత్తకోటకు వస్తున్న గిరిజనులు చూసి డీఎఫ్‌వో చలించిపోయారు. చీమలపాడు పంచాయతీ శివారు చలిసింగం గ్రామంలో 450 మంది ఎస్టీ భగతకు చెందిన గిరిజనులు నివసిస్తున్న ఈ ప్రాంతానికి రహదారి సౌకర్యం లేని విషయం తెలిసిందే. ఎవరికైనా అనారోగ్యం చేస్తే నాలుగు కిలోమీటర్ల మేర కొండ కిందకు డోలీ మోతతో దించాలని, సకాలంలో వైద్య సేవలు అందక ఎంతో మంది గిరిజనులు మృత్యువాత పడ్డారని పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. గిరిజనులు ఎన్నోసార్లు రహదారి కోసం ఆందోళనలు గిరిజనులు చేశారు. దీంతో 2018లో ప్రస్తుత ఎమ్మెల్యే రాజు సబ్‌ప్లాన్ కింద రూ.కోటి 90 లక్షలు మంజూరు చేయగా, రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు లేనందున నిలిచిపోయింది. అలాగే వైసీపీ ప్రభుత్వ హయాంలో విప్ హోదాలో వెళ్లిన కరణం ధర్మశ్రీని గిరిజనులు గ్రామ సరిహద్దులోనే అడ్డగించి నిరసన తెలిపారు. దీంతో 2023లో మళ్లీ రూ.2.66 కోట్లు నిధులు మంజూరు చేసి, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు.



కొండలు ఎక్కి చలిసంగం గ్రామం వెళ్తున్న డీఎఫ్‌వో శామ్యూల్, తదితరులు

అయితే అటవీ శాఖ అనుమతులు లేక ఈ రోడ్డు పనులు ప్రారంభమే కాలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ఎమ్మెల్యే రాజు ప్రత్యేక చొరవ చూపారు. దీంతో రోడ్డు నిర్మాణానికి అనుమతుల కోసం అటవీ శాఖ అధికారులు చలిసింగం కొండలు ఎక్కి గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. దీనికి ఆయన స్పందిస్తూ రోడ్డు నిర్మాణానికి అభ్యంతరం లేదని, త్వరలోనే అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, చీమలపాడు సర్పంచ్ వంజరి గంగరాజు పాల్గొన్నారు.

రంగురాళ్ల తవ్వకాలపై కఠిన చర్యలు

- అటవీ శాఖ రేంజ్ అధికారి లక్ష్మీనర్సు

గొలుగొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రిజర్వ్ ఫారెస్టులో రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ రేంజ్ అధికారి లక్ష్మీనర్సు హెచ్చరించారు. మండలం లోని కరక, కొత్త ఎల్లవరం, కశిమి గ్రామస్థులతో శనివారం ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం గ్రామాల్లో రిజర్వ్ ఫారెస్టులోని రంగురాళ క్వారీల వద్ద అటవీ సిబ్బందితో నిఘా పెట్టామన్నారు. అలాగే మొబైల్ బృందాలతో పెట్రోలింగ్ కోసం చర్యలు చేపట్టామన్నారు. తవ్వకాలు జరగకుండా నిరంతరం క్వారీల వద్ద కాపలా ఏర్పాటు చేశామన్నారు. క్వారీ ప్రాంతాల్లో అటవీ సెక్షన్ ప్రకారం వ్యక్తులు తమ అనుమతులు లేకుండా తిరగరాదన్నారు. ఈ విషయంలో తమ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నర్సీపట్నం అటవీ సెక్షన్ అధికారి రామాంజులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ ప్రాంతీయ చైర్మన్‌గా దేవరపల్లి నవకుమార్

చోడవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ ప్రాంతీయ చైర్మన్‌గా పట్టణానికి చెందిన దేవరపల్లి నవకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ చైర్మన్ ప్రశాంత్ కుమార్ శనివారం నియామకపత్రాన్ని అందించారు. రెండేళ్లపాటు ఈ పదవీ కాలం ఉంటుందని, చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు నవకుమార్ చైర్మన్‌గా ఉంటారని, ఈ ప్రాంతంలో నిరుపేద కూలీలు, ఇతర వర్గాల ప్రజానీకం సమస్యలపై పనిచేస్తారని ప్రశాంత్‌కుమార్ వెల్లడించారు. కౌన్సిల్ చైర్మన్‌గా నియమితులైన నవకుమార్‌ను స్థానిక పెద్దలు అభినందించారు.

బీజేపీ నేత సాంబమూర్తి మృతి

రావికమతం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో టి.అర్జాపురం గ్రామానికి బీజేపీ సీనియర్ నేత పిల్లా సాంబమూర్తి (85) శుక్రవారం రాత్రి మృతి చెందారు. పార్టీలో 1980లో క్రియాశీలక సభ్యుడిగా, 1986లో పార్టీ అధ్యక్షుడిగా, 2014 నుంచి 2019 వరకు జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యునిగా పనిచేస్తూ ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులుగా పేరొందారు. ఆయన మృతికి కూటమి నాయకులు రాజాన కొండనాయుడు, కందర్ప రమణమూర్తి, గల్లా రాజేశ్వరావు, కొండబాబు, దూది రాజేశ్, కె.ఈశ్వరావు, గూటాల చిన్న, దంట్ల సత్యనారాయణ తదితరులు నివాళులు అర్పించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

సారె ఊరేగింపులో ఆకట్టుకున్న మేళతాళాలు, నృత్యాలు



పలు రకాల పిండి వంటకాలతో సారె ఊరేగిస్తున్న భక్తులు

రావికమతం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రావికమతం శివ పంచాయతన ఆలయంలో ముక్కోటి ఏకదశమి సందర్భంగా రాత్రి శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిల కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం స్వామి, అమ్మవార్లకు సారె సమర్పన కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామంలో ఇంటింటి నుంచి ఒక్కో రకం పిండి వంట చొప్పున మహిళలు రకరకాలు మిఠాయిలను తీసుకు వచ్చారు. మేళతాళాలు, డప్పుల వాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామి వారికి, అమ్మవార్లకు సమర్పించారు. పిల్లవానిపాలెం గ్రామానికి చెందిన పద్మావతి కళామండలి సభ్యులు ప్రత్యేక వస్త్రధారణతో చేసిన కోలాటం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే తప్పెటిగుళ్ల ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాచకొండ ఆంజనేయమూర్తి, లక్ష్మీనారాయణ, భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న షుగర్స్ కార్మికుల ఆందోళన



ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చోడవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గోవాడ చెరకు రైతుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆంధ్రప్రదేశ్ చెరకు రైతుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ఫ్యాక్టరీ ఎదుట శనివారం కూడా ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు యాజమాన్యం ఇప్పటికీ బకాయిలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. యాజమాన్యం తీరువల్ల ఇప్పటికే రైతులు సరుగుడు, ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లిపోయారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గండి నాయనిబాబు, ఎస్వీ.నాయుడు, బి.దేవుళ్లు, ఎస్.విశ్వనాథం, వెంటయ్య, ఈశ్వరరావు, తాతప్పారావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును కలిసి వినతిపత్రం సమర్పించారు.

గుడివాడ రెవెన్యూలో ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించిన అధికారులు

రావికమతం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలం ఆక్రమించి అక్రమ నిర్మించిన ప్రహరీని శనివారం రెవెన్యూ అధికారులు తొలిం చారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గుడివాడ రెవెన్యూ పరిధిలోని గొంప మెట్ట సమీపంలో సర్వే నంబరు 338/2లో సుమారు 15 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని పిల్లావానిపాలెం గ్రామానికి చెందిన ఓ నాయకుడు ఆక్రమించి కంచె ఏర్పాటు చేశారని, దీనిపై గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల వెళ్లి పరిశీలించి ఆక్రమణ నుంచి తొలగిపోవాలని సూచించామని, అయినప్పటికీ ఆక్రమణదారుడు వదలకపోవడంతో ఆర్ఐ సతీశ్, వీఆర్వోలతో తొలగించామని తహసీల్దార్ బి.వెంకటరమణ తెలిపారు.

శ్రీవిద్యా కళాశాలలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వేడుకలు జరుపుకుంటున్న కళాశాల విద్యార్థినులు

నర్సీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీవిద్యా కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ వేడుకలో డీఎస్పీ మోహన్, సీఐ గోవిందరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి హాజరయ్యారు. కళాశాల ఆవరణలో రంగవల్లులు, గొబ్బెమ్మలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కర్రసాము ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.సత్యవతి, డైరెక్టర్ బి.దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం ఉషోదయ కళాశాలలో...

చోడవరం: స్థానిక ఉషోదయ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రమణాజీ, కరస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ వాసు, ప్రిన్సిపాళ్లు ఎస్ఎస్.నాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

నేడు దళిత ఐక్యవేదిక సమావేశం

దేవరాపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం దళిత సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘం మండల నేత కాటపల్లి అప్పారావు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలోని సన్యాసమ్మ ఆలయం ఆవరణలో మధ్యాహ్నం రెండు గంటలకు ఈ సమావేశం ప్రారంభిస్తామని చెప్పారు. దళిత సంఘాల నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

1300 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

నర్సీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్, ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలోని మాకవరపాలెంలో 1300 లీటర్లు బెల్లం పులుపు ధ్వంసం చేశామని సీఐ సునీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కిరణ్‌కుమార్, గోవర్ధన్, నారాయణరావు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

కోడి పందాలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

-జి.కోటేశ్వరావు, సీఐ, కొత్తకోట



సంక్రాంతి పండగను పురస్కరించుకుని సర్కిల్ పరిధిలో కోడి పందాలు, జూదం, గుల్లాటలు , అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. వారిపై కేసులు పెట్టడంతో పాటు చర్యలు ఉంటాయి. ఇందుకు సంబంధించి ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేశాం.

ప్రశ్న: సంక్రాంతి సందర్భంగా గ్రామీణ ప్రాంత పల్లె తీర్థాల్లో కోడి పందాలే ఓ ప్రత్యేకత. వీటికి పోలీసు అనుమతుల కోసం గ్రామస్థులు, నిర్వాహకులు కోరితే ఏమైన అనుమతులు ఇస్తారా?

జ: సంక్రాంతి పెద్దల పండగ, కనుక కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలే తప్ప కోడి పందాలు, జూదం, అశ్లీల నృత్యాలు నిర్వహించడం చట్ట వ్యతిరేకం. ఈ విషయంలో ఎంతటి వారైనా అనుమతులు ఇవ్వం.

ప్ర: తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి వంటి జిల్లాలో ఎమ్మెల్యే, ఎంపీలు పాల్గొని కోడి పందాలు బహిరంగంగా నిర్వహించేవారు. అక్కడ లేని ఆంక్షలు ఇక్కడ ఎందుకు?

జ: చట్టమనేది ఎక్కడైనా ఒక్కటే. అక్కడ ఒక్కటి, ఇక్కడ ఒక్కటి కాదు. కోడి పందేలు, జూదం, అశ్లీల నృత్యాలు నిషేధించాలన్న హైకోర్టు ఆదేశాలపై జిల్లా ఎస్పీ ఆదేశాలను తాము తప్పకుండా చేస్తాం.

ప్ర: కోడి పందాలను ఎలా నియంత్రిస్తారు. ఇందుకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారు?

జ: సర్కిల్ పరిధిలో కొత్తకోట, రావికమతం, రోలుగుంట, బుచ్చియ్యపేట ఎస్ఐలకు ఇప్పటికే వీటిపై చేపట్టాల్సిన చర్యలు, విధివిధానాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. అలాగే ప్రత్యేక నిఘా బృందం కూడా ఏర్పాటు చేశాం. కోడి పందాలను అరికట్టేందుకు గ్రామాల్లో ప్రజల సహకారం కూడా కోరుతున్నాం.

ప్ర: గ్రామాల్లో చోరీల నియంత్రణకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారు?

జ: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామం విడిచి పొరుగు ప్రాంతాలకు వెళ్లే వారు ముందుగా ఆయా పోలీసు స్టేషన్‌లకు సమాచారం ఇస్తే, ఆ ఇళ్లపై ప్రత్యేక నిఘా పెడతాం. అలాగే ట్రిబుల్ బైక్ డ్రైవింగ్, రేస్ డ్రైవింగ్ చేసినా, మద్యం తాగి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తాం.

-రావికమతం

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

రోలుగుంట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణారావు హెచ్చరించారు. శనివారం స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగ రోజుల్లో సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడి పందాలు, పేకాట, గుండాట తదితర అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మండలంలో ఎక్కడైనా ఇటువంటి కార్యక్రమాలు చేపడితే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

విశ్రాంత వీఆర్వోకు 'బూడి' పరామర్శ

దేవరాపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్వో కూండ్రపు అప్పారావును మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు శనివారం పరామర్శించారు. ఇటీవల అప్పారావు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్ద వైద్యం పొందుతున్నారు. ఈ క్రమంలో ఆయనను ముత్యాలనాయుడు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు బూరె బాబూరావు, సన్యాసినాయుడు, వెంకటరమణ, రాము, సంతోశ్, నాయుడు తదితరులు ఉన్నారు.

మోదకొండమ్మకు పావు కిలో వెండి విరాళం

మాడుగుల రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరులో కొలువైన మోదకొండమ్మ అమ్మవారికి శనివారం స్థానిక భక్తులు అద్దిపల్లి కొండబాబు కుటుంబ సభ్యులు పావు కిలో వెండి వితరణగా అందించారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు ఆలయంలో వెండిని అప్పగించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్ల ప్రారంభం

మాకవరపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్లను టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మినీ గోకులాల షెడ్లకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే మొదటి విడతగా మండలంలో 40 షెడ్లు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో నూతనంగా నిర్మించిన జి.కోడూరు మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేత జయబాబు, ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

16 నుంచి దేహదారుఢ్య పరీక్షలు పునఃప్రారంభం

విశాలాక్షినగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు ఈనెల 12 నుంచి 15 వరకు నిలిపివేయనున్నారు. 16వ తేదీ నుంచి యథావిధిగా పరీక్షలు జరుగుతాయని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. కాగా పురుష అభ్యర్థులకు శనివారం దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. 600 మందికి 319 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్. మోహనరావు, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస పూజలు

నక్కపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా మండలంలోని ఉపమాక క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శనివారం ఉదయం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కొండపై ఉన్న స్వామి నిజరూపానికి, కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు, నిత్య హోమాలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయం పక్కనున్న శ్రీవారి పుష్పతోటలోకి తీసుకెళ్లి అక్కడి రాతి మండపంపై పూజలు చేశారు. అనంతరం పల్లకీలో గోదాదేవిని, రాజాధిరాజ వాహనంపై స్వామివారిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



స్వామివారికి పూజ చేస్తున్న అర్చకులు

ఉక్కులో వీఆర్‌ఎస్!

- నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవలసిందిగా యాజమాన్యం ప్రకటన
- మార్చి నాటికి వేయి మందిని తగ్గించాలని నిర్ణయం

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):ముందు నుంచి ప్రచారం జరుగుతున్నట్టుగానే విశాఖపట్నం స్టీల్ ప్లాంటు (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్-ఆర్ఐఎన్ఎల్) స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్-వీఆర్ఎస్) శనివారం ప్రకటించింది. ఇంకా ఏడాది సర్వీసు మిగిలి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొంది. ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకుంటే మార్చి నెలాఖరులోగా సెటిల్‌మెంట్ చేస్తారు. ఎగ్జిక్యూటివ్‌లు 500, నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు 500 మంది కలిపి మొత్తం వేయి మందికి తొలి విడత వీఆర్ఎస్ ఇస్తారు. కాంట్రాక్టు, డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, క్యాజువల్ కార్మికులు, స్టడీ లీవులో ఉన్నవారు దీనికి అనర్హులు. అయితే దరఖాస్తు చేసుకునేవారికి కనీసం 15 ఏళ్ల సర్వీసు (సీనియారిటీ), 45 ఏళ్ల వయసు ఉండాలని నిబంధన పెట్టింది.

వెళ్లిపోవాలనే ఆలోచనలో అత్యధికులు

విశాఖ స్టీల్‌ప్లాంటు చాలా ఇబ్బందుల్లో ఉంది. ప్లాంటును పూర్తిస్థాయిలో నడపడానికి అవసరమైన నిధులు లేవు. ముడి పదార్థాల కొరత ఉంది. కేంద్రం సాయం చేస్తామని మాటలు మాత్రమే చెబుతోంది. కనీసం జీతాలు కూడా ఇవ్వడం లేదు. ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు లేవు. మొన్న దసరా, దీపావళి పండుగలకు జీతాలు ఇవ్వలేదు. ఇప్పుడు సంక్రాంతికి కూడా ఇవ్వలేదు. ఎప్పుడో ఇస్తారో కూడా చెప్పడం లేదు. అంటే యాజమాన్యానికి జీతాలు సక్రమంగా ఆలోచన లేదని ఉద్యోగులకు అర్థమైంది. మరోవైపు కాంట్రాక్టు కార్మికులను భారీగా తగ్గించడంతో అనేక విభాగాల్లో నిర్వహణ పనులు ఆగిపోయాయి. దాంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. తక్కువ వనరులతో పూర్తి ఉత్పత్తి తీయాలని ఒత్తిడి పెడుతున్నారు. అలా చేసినా జీతాలు ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ పనిచేయడం కంటే ఎంత ఇస్తే అంత తీసుకొని బయటకు వెళ్లిపోవడమే మంచిదని అత్యధికులు భావిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది కుటుంబాలను పోషించుకోవడానికి రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నారు.

ఏయూకు రీసెర్చ్ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

స్పోక్ సెంటర్లుగా వ్యవహరిస్తారు. ఈ ఏడాది ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఏయూ 41వ స్థానాన్ని దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏయూను బిట్స్ పిలానీ హబ్‌కు కేటాయించారు. బిట్స్‌కు కేటాయించిన వంద కోట్లలో స్పోక్ యూనివర్సిటీలకు పరిశోధన ప్రాజెక్టుల నిమిత్తం రూ.10 కోట్లు చొప్పున కేటాయించనుంది. ఈ మేరకు ఏయూకు రూ.10 కోట్లు బిట్స్ మంజూరుచేసింది. ఏయూ సముద్ర గర్భంలోని వస్తువులు, జీవ రాశులు, ఇతర అంశాలకు సంబంధించి పరిశోధన సాగించనున్నది. ఐదేళ్లపాటు ఈ ప్రాజెక్టు కొనసాగుతుందని ఏయూ వీసీ ప్రొఫె సర్ జి.శశిభూషణరావు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా అందించే నిధులను పరిశోధన సాగించేందుకు అవసరమైన పరి కరాలు, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ కొనుగోలుతోపాటు పరిశోధకులకు ఉపకార వేతనాలు చెల్లిం చేందుకు వినియోగించనున్నారు. ఇంజ నీరింగ్‌తోపాటు సైన్స్ కాలేజీ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన పరిశోధకులకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. గతంలో ఈ నిధులను డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నేరుగా యూనివర్సిటీలకు అందిం చేది. ఈ ఏడాది హబ్స్‌గా ఏర్పాటుచేసి వాటికి కేటాయిస్తోంది. పరిశోధనకు సంబంధించి యూనివర్సిటీల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని సీనియర్ ప్రొఫెసర్లు చెబుతున్నారు.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

వంతెనలు, రక్షిత మంచినీటి పథకాలకు సుమారు 500 మీటర్ల సమీపంలో తవ్వకాలు జరపరాదన్న నిబంధన ఉన్నా అక్రమార్కులు పట్టించుకోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వరహా నదిలో ఇసుక యథేచ్ఛగా తోడేసి నదీ గర్భాన్ని గుల్ల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితిలో మార్పు ఉంటుందని, ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు భావించినా ఇసుక అడ్డగోలు తవ్వకాలు నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చుక్కల్లో విమాన టికెట్ల ధరలు

... 5వ పేజీ తరువాయి

ఉంటుంది. ఇప్పుడు రూ.15 వేల నుంచి రూ.17 వేలు చూపిస్తోంది. చెన్నై నుంచి విశాఖకు సాధారణ రోజుల్లో టికెట్ ధర రూ.5 వేలలోపు ఉండగా ఇప్పుడు రూ.17 వేలు దాటి చూపిస్తోంది.

విజయవాడ విమానాలకు డిమాండ్

రాష్ట్ర రాజధాని విజయవాడ నుంచి విశాఖపట్నానికి మామూలు రోజుల్లో విమాన టికెట్ ధర రూ.3 వేలు ఉండగా ఇప్పుడు అది రూ.7వేలకుపైనే చూపిస్తోంది.

క్రైం... crime news

బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

ఎలమంచిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం మండలంలోని యర్రవరం సమీప జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎలమంచిలి మునిసిపాలిటీ పెదపల్లికి చెందిన బొద్దపు త్రినాథరావు(52) ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. శనివారం ఆయన బైక్‌పై విధులకు బయలుదేరగా జాతీయ రహదారి వద్ద గల పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి ఎదురుగా బైక్‌పై వస్తున్న అదే గ్రామానికి చెందిన కడింశెట్టి భావనాశెట్టి పరస్పరం ఢీకొన్నారు. దీంతో తీవ్ర గాయాలై త్రినాథరావు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన భావనాశెట్టిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి




మృతి చెందిన వెంకటేశ్

చింతపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా చింతపల్లి మండలంలోని రాజుపాకలు గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం శనివారం మధ్యాహ్నం ఓ లారీలో తారును విజయవాడ నుంచి చింతపల్లి తీసుకొస్తున్నారు. రాజుపాకలు గ్రామసమీపంలో లారీకి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో లారీలో ప్రయాణిస్తున్న విజయవాడ సమీపంలోని పరిటాల గ్రామానికి చెందిన క్లీనర్ తస్నీరు వెంకటేశ్ భయంతో కిందకు దూకేశాడు. దీంతో రహదారిపై పడిపోయిన వెంకటేశ్ తలకు బలమైన గాయం కావడంతో సంఘటన స్థలంలోనే చనిపోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందాలు ఆడుతున్న తొమ్మిది మంది అరెస్టు

- ఎనిమిది ద్విచక్రవాహనాలు, నాలుగు కోడిపుంజులు స్వాధీనం



నిందితులతో పోలీసులు

రావికమతం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపూడి శివారు జీడితోటల్లో శనివారం కోడి పందాలు ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొన్నట్టు కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి నాలుగు కోడి పుంజులు, రూ.810 నగదుతోపాటు ఎనిమిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలలో కోడి పందాలు, జూదం, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	102.00
లైవ్ ధర	122.00
విత్ స్కిన్	214.00
స్కిన్ లెస్	224.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524